# రహస్యం

ఎం.వి.ఎస్.ఎస్. ప్రసాద్

రిక్షా దిగిన శేఖరం మరొక్కసారి చేతిలో ఉన్న అడ్రసు కాగితాన్ని పరీక్షగా చూసాడు. అడ్రసు అదే రిక్షా అతనికి డబ్బు లిచ్చి మెల్లిగా గేటు తీసుకుని లోపలకు వెళ్ళాడు.

అతని రాకను కిటికీలోంచి చూసిన సుబ్బారావు "ఏరా బావా ఏమిటీ ఈ ఉరుములేని పిడుగు" అంటూ అతనిని కౌగలించుకున్నంత పని చేసాడు

శేఖరం, సుబ్బారావులు మేనత్త మేనమామ పిల్లలు సుబ్బారావు ఆ ఊరిలో గవర్నమెంటు ఉద్యోగి శేఖరం హైదరాబాద్‌లో ఒక డిటెక్టివ్ ఏజన్సీలో పని చేస్తున్నాడు

"ఏమిటీరా! ఏమిటిలా ఊడిపడ్డావు?" అంటూ మరొక్కసారి ప్రశ్నించాడు సుబ్బారావు

"ఆఁ ఏదో పని తగిలితేను' అని కుర్చీలో కూర్చుంటూ గదిని పరిశీలించ సాగాడు శేఖరం

"మొత్తానికి నీ డిటెక్టివ్ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు చెప్పా పెట్ట కుండా రావడం వచ్చిన వెంటనే గదంతా చూసేయడం"

"ఆఁ! ఏదో అలవాటులో పొరపాటు లేరా" అన్నాడు శేఖరం నవ్వుతూ

"ఒరేయ్ శేఖరం ఈవాళ కొంచెం పెంద రాళే వెళ్ళాలి నేను వెడతాను ఇదిగో డూప్లికేటు కీ ఆరు గంటలకల్లా మరలా రూములో వాల్తాను ఈ లోపల నీ పనులు చూసుకో రాత్రి బీరకాయలు తాగి ఏ సెకెండ్‌షోకో చెక్కేద్దాం పద బాత్రూమ్ అదీ చూపిస్తాను. ఇంతకీ ఎన్ని రోజులుంటావు?" గుక్క తిప్పు కోకుండా మాట్లాడాడు సుబ్బారావు

"ఏరా నీ కేదైనా ఇబ్బందా?" ఆశ్చర్యంగా మొహం పెట్టి అడిగాడు శేఖరం

"అబ్బే! అదేంలేదు ఊరికేనే" నసి గేసాడు సుబ్బారావు.

"నే వస్తానురా. బాత్రూమ్ చూసా వుగా" అంటూ హడావిడిగా వెళ్ళి పోయాడు సుబ్బారావు.

శేఖరం తన జేబులోని ఉత్తరంతీసి మరొక్కసారి చదవడం ప్రారంభించాడు

చి శేఖరానికి మీ మామయ్య ఆశీర్వదించి వ్రాయునది. ఉభయకుశలో పరి ఈమధ్య నీ దగ్గరనుంచి ఉత్తరాలు లేవు మీ నాన్నగారూ అమ్మ కులాసా అని తలుస్తాను ఇప్పుడు నీ కో ముఖ్య విషయం రాస్తున్నాను ఈమధ్య మా అబ్బాయి సుబ్బారావు ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటోంది వాడు ఉండే ప్రదేశం కూడా అంత మంచిది కాదు ఒకసారి నేను ఏదో పనిమీద వాడి ఊరికి వెళ్ళి వాడి గదికి వెళ్ళేసరికి ఆ గదిలో ఆడపిల్లల బట్టలు కనిపిం





చాయి " పెళ్ళికాని కుర్రాడివి ఇదంతా ఏమిటిరా'' అని అడిగితే ఏమీ మాట్లాడ లేదు గట్టిగా అడిగితే అసలవి అక్కడకు ఎలా వచ్చాయో తెలియదన్నాడు సరే ఆ రోజు సాయంత్రం ఇంటాయనని అడిగాను మా వాడ గదికి ఎవరన్నా ఆడపిల్లలు వస్తున్నారా అని ఆయన వెకిలిగా నవ్వి ఆ వీధిలో చాలా ఇళ్ళకి ఆడవాళ్ళు మగవాళ్ళు స్వేచ్ఛగా వచ్చి వెడుతుంటారని. ఆ సంగతి ఎవ్వరూ పట్టించుకోరని అన్నాడు

నేను కొయ్యబారిపోయాను ఎవ్వత్తినో ప్రేమించాడు, పెళ్ళి చేసు కుంటాడని సరిపెట్టుకుందామను కున్నాను కానీ అలాంటి వేషాలు వేస్తు న్నాడని ఊహించలేకపోయాను ఆ రూమ్ మారమని శతవిధాల చెప్పాను వినిపించుకోలేదు

'బాబూ' శేఖరం నువ్వూ వాడూ బాగా చనువుగా ఉంటారుకదా అది కూడా డిటెక్టివ్‌గా పని చేస్తున్నావు నీకు వృత్తి రీత్యా ఇది చాలా చిన్న పనిగానూ, హాస్యాస్పదంగానూ కనిపించవచ్చు కానీ నాకూ, మీ అత్తయ్యకు సుబ్బారావు ఒక పెద్ద సమస్యలా తయారయ్యాడు వీలైనంత త్వరలో నువ్వు ఒకసారి వాడి ఊరికి వెళ్ళి విషయం కనుక్కుని, వాడి కింత గడ్డి పెట్టగలవని ఆశిస్తున్నాను

ఆశీస్సులతో
నీ మామయ్య

ఉత్తరం జేబులో పెట్టుకుని గదంతా మరొక్కసారి పరిశీలించాడు శేఖరం. పరుపుకింద లంగాలు, బ్రాలును ప్యాంటీలు, చీరలు కనిపించాయి శేఖరం గది బయటకు వచ్చి చుట్టు పక్కల చూశాడు సుబ్బారావు గది కెదురుగా ఒక చౌకబారు లాడ్జి కనిపించింది శేఖరంకి ఒక ఆలోచన వచ్చింది

ఆ రోజు సాయంత్రం సుబ్బారావుతో సినిమాకు బయలు దేరాడు శేఖరం

"రేపటినుంచి నైట్ డ్యూటీలు ఉన్నా యిరా రాత్రుళ్ళు రూములో ఉండడం కుదరదు'' అన్నాడు శేఖరం సుబ్బారావు మొహం పరిశీలనగా చూస్తూ సుబ్బా రావు మొహంలో రిలీఫ్ స్పష్టంగా కనిపించింది

"ఎక్కడకి వెడతావురా!'' అని అడిగాడు సుబ్బారావు

"అవన్నీ నీకు చెప్పకూడదు ప్రొఫెష నల్ సీక్రెట్స్''

మరునాడు శేఖరం లాడ్జిలో రూము తీసుకుని రాత్రులు అక్కడ వరండాలో కూచుని సుబ్బారావు రూము కేసి పరిశీల నగా చూడడం ప్రారంభించాడు రెండు రోజులు ఏమీ లాభం లేకపోయింది అయితే మూడవరోజు సమస్య విడి పోయింది మరునాడు శేఖరం లాడ్జి ఖాళీ చేసి, తను వచ్చిన పని అయిపోయిందని వెళ్ళిపోతున్నానని సుబ్బారావుకి చెప్పి బయలు దేరాడు

* * * * *

"విషయం తెలుసుకుని వచ్చాను మామయ్యా! మీవాడు నువ్వు అను కున్నట్టు ఏమీ చెడిపోవడం లేదు కానీ అనారోగ్యం పట్టుకుంది మొదట్లో ఈ ఊరు తీసుకువద్దామనుకున్నాను కానీ ఈ పల్లెటూళ్ళో మీ వాడికి వైద్యం చేయించరు సరికదా దేముడు, దెయ్యం అంటూ గొడవ చేస్తారు నువ్వు వీలైనంత త్వరలో హైదరాబాద్ తీసుకురా అక్కడ డాక్టర్‌కి చూపిద్దాం'' అన్నాడు శేఖరం

ఇంతకీ విషయ మేమిట్రా?'' అని ఆతృతగా అడిగాడు శేఖరం మామయ్య

"ఏమీలేదు మామయ్యా మీ వాడికి "ట్రాన్స్ వెస్టిజమ్'' అనే మెంటల్ డిజార్డర్ ఉంది. ఆ వ్యాధి ఉన్న ఆడవాళ్ళు మగ డ్రెస్సులు వేసుకోవాలని, మగవాళ్ళు ఆడవాళ్ళ డ్రస్సులు వేసుకోవాలని తహతహలాడతారు హైదరాబాద్‌లో సైకియాట్రిస్ట్‌కి చూపిద్దాం'' అన్నాడు శేఖరం అతని మామయ్య మొహంలో ఒక పీడ వదిలించుకుంటే ఇంకొకటి తగులుకుందే అన్న బాధ కనిపించింది శేఖరంకి ●